BRINDAVANAM

SRI KRISHNA'S SONG OF ROMANTIC SAD

ANKALLA PRUDHVI RAJ



అయ్యో ఈ భాగ్యంబు
అభాగ్యంబుగా
నన్ను భాగాలుగా
అద్వైతం నుండి
ద్వైతంగా
విశిష్టుడినై, శిష్టుడినై
శ్రేష్ఠుడినైనానో!
రాజీపడని నా అహం
అదుపు చేయని
నాకామం మధ్య ఘర్షణ
తీవ్రతరం దాల్చడం
వేగవంతమయ్యే నోయీ!

శ్రీకృష్ణుని విరహగీతం

బృందావనం

1




అంకాళ్ళ పృథ్విరాజ్

అంకాళ్ళ పృథ్విరాజ్

శ్రీకృష్ణుని విరహగీతం

బృందావనం

1



బృందావనం (శ్రీకృష్ణుని విరహగీతం)
అంకాళ్ళ పృథ్వీరాజ్

శ్రీవైష్ణవ ప్రచురణ

ప్రచురణ : ఫిబ్రవరి 9-10, 2019

ప్రతులు : 300

ప్రతులకు : **అనేక పుస్తక కేంద్రం,** విజయవాడ
ఫోన్ : 9247253884
&
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

లే అవుట్ &
కవర్ పేజి : రఫి

వెల : **రూ. 50/-**

ప్రింటింగ్ : నాగేంద్ర ఎంటర్‌ప్రైజెస్, విజయవాడ.
ఫోన్ : 0866 257511

అంకితం

అణగారిన జాతులకు అక్షరాన్ని
పరిచయం చేసిన సామాజిక విప్లవకారుడు
శ్రీభగవత రామానుజాచార్యుల స్ఫూర్తితో...
శ్రీవైష్ణవ సాంప్రదాయాన్ని తుదకంటూ కొనసాగించి
ఆస్తులకన్నా అక్షరం మిన్న అని గుర్తించి మా వంశానికి
అక్షర జ్ఞాన సంపదను పంచిన మా ముత్తాత
అంకాళ్ళ కోటయ్య దాసుకు...
మరియు మా తాత **ఏడుకొండలగార్లకు...**

ఇది అందరి గానం..

నాకూ, పృథ్వీకీ ఇష్టమైన కవి వేటూరి సుందరామ్మూర్తి. సినీ నిర్మాత సూచనలతో ఎన్ని వర్షన్లు రాసినా, వాటిలో ఏది ట్యూన్‌కు ఎంపిక అయినా, తొలిసారి రాసిన పాట వర్షనే తనకు ఇష్టమని వేటూరి అనేవారు. పృథ్వి దీర్ఘగానం 'బృందావనం' అలాంటి తాజా వ్యక్తీకరణ. ఆయనలోని మరో కోణం. ఆమాటకొస్తే, మనందరిలో అణచిపెట్టబడే మానసిక ద్వైదీ తత్వానికే పృథ్వి ఒక ఆకారం ఇస్తున్నాడు. తన గొంతు అందిస్తున్నాడు. గానం చేస్తున్నాడు.

"స్వప్న విహారంలో మేలుకొల్పే వస్తువమా,
పెదాలు పలికే మాటలకై అన్వేషించే దృశ్యమా,
మనసులోని మర్మాన్ని భావీకరించే అర్థమా
నీలో నన్ను మార్చుకునే ప్రయోగమా
మరువని అర్ధ భాగస్వామ్యమా.... రాధా...!"

ఈ రాధ ఎవరు. కృషుడు ఎవరు, కురుక్షేత్రం ద్వాపరలోనే ఆగిపోయి, యుగయుగాలకు సరిపడా శుభం పూసిందా? తాను ఓడి రాధను గెలుచుకోడానికే ఈ కురుక్షేత్రమని కృష్ణుడు అన్నాడుగానీ, బర్త్ -సెక్స్- డెత్ క్రమణిక గురించి ఎలియట్ కూడా చెప్పాడుగానీ, ఈ కురుక్షేత్రం ఎక్కడో బయట కాకుండా, ఏదో ఒక కాలావధికి బందీ కాకుండా ఈనాటికీ కొనసాగుతూనే ఉంది. దాని క్షేత్రం కురు భూమిలా ధ్వనించినా, నీలోని, నాలోని నిత్య యుద్ధమే ఇది. మన ఆత్మలను వెలిగించుకోడానికీ, అహాన్ని కరిగించుకోడానికీ, మనల్ని మనం అంతిమంగా అర్పించుకోడానికీ జరుగుతున్న గత, వర్తమాన, భవిష్య గర్భిత యుద్ధమిది. అన్ని యుద్ధాలను రద్దు చేసే ఈ యుద్ధాన్ని ఆత్మార్పితసహితంగా గెలుద్దామని పృథ్వి గానం చేస్తున్నాడు. విందాం పదండి!!

- రివేరా

"The poets are only the interpreters of the gods"

- Socrates

Greek Athenian Philosopher
(470 BC - 399 BC)

బృందావనంలోకి...



నా కళ్లముందే తిరుగుతుందే
నా విముక్తి మోక్ష ప్రదాతా!
నీ కవ్వింపు కసరత్తులకూ,
శబ్ద మోహింపులకూ చలింపని
ఈ భక్తుని అజ్ఞానమును క్షమించవూ!
నీకు దాస్యుడనై శాంతభక్తుడనై
వాత్సల్యాన్ని కోరుతూ
మధురభక్తిలో మధుర భక్తివై
అనుగ్రహించి సాయుజ్యాన్ని
ప్రసాదించవే రాధా!

రాధా రాధా రాధా
రాధా రాధా రాధా!
రసవిహీనుడిని రసజ్ఞుడినిగా
రమింపరాని వాడిని రమింపుడిగా
తీర్చిదిద్దరావా....
నీ బంధాలను తెంచుకునే
హృదయ స్వేచ్ఛా తరంగాలు
నా కామ్య కోర్కెలను
జన్మింప ఆధ్యంతారహిత
ప్రణయ రాధా!
నీ కోసం నిరీక్షిస్తూ
భారంగా గడుపుతున్న
కాలం నెమ్మదించింది.
నీ కోసం ఎదురుచూస్తూ
అలసిపోయిన కళ్లు
ఎర్రబారుతున్నాయి.
మొన్నటి బంధాలూ,
నిన్నటి అందాలూ
నా హృదయాన్ని కనికరించడంలేదు
నీకై ఆవేదన
వేదాంతంగా మారకుండా
సముద్రపు చప్పుడై వినపడవా!
నీకై పరితపించే

నా మనస్సును
హోరుగాలై తాకిపోవా.
నీవే సర్వస్వమైన నన్ను నీ తోడుగా
కలుపుకుపోవా!
రాధా రాధా రాధా....
మల్లెల పరిమళాలను
ఆస్వాదిస్తూ,
హృదయ బంధనాల నుండి గోచరించే
దృశ్యాలను వీక్షిస్తూ
ప్రపంచ విముక్తికై
కలలు కనే
పగటి కలల వీరుడ్ని,
నీ కోసం పరితపిస్తూ,
నిన్ను పొందాలనుకునే
స్వప్నపు మేఘాల
దృశ్యాలను పరిశీలిస్తూ,
ఆనంద లాలింపులలో
నిద్రకు ఉపక్రమించాలనుకునే
మూర్ఖుడను.

2)
స్వేచ్ఛను పొందాలనుకునే
కాంతి తపన

తన తెగింపుతో వ్యక్తపరుస్తుంది.
అమాంతం ప్రియుణ్ణి
కౌగిలించుకోవాలనే తపనతో
ఎదురు చూస్తున్న ప్రేయసి
ఆవేదనను చూస్తూ
నిశ్శబ్దం వహిస్తున్న నిరాధారుడిని.
విశాల మైదానాన్ని
చీల్చుకుని మొలిచే
గడ్డి పరకలపై వర్షపు
చినుకులు కల్పించే
ఆనందాన్ని పొందలేని
అభాగ్యుడిని.
నా ఆవేదనే ఆశయంగా,
ఆశయమే ఆవేశంగా
వ్యక్తపరుస్తున్న
సామాన్య మానవుణ్ణి..
రాధా రాధా సామాన్యుడిని రాధా!
ఈ బృందావనంలో,
ఈ బృందావనంలో...
నల్లని కురుల సిరుల
వయ్యారాలే
అరణ్య పర్వతాలై
వీక్షిస్తున్నాను.

ఎద పొంగింపులు
వృక్షాల వీయుంపులై
ఆస్వాదిస్తున్నాను.
నడుమొంపులు
యమునా నదివలే
పరవళ్లు తొక్కుతున్నాయి.
నీ లేత పాదాల స్పర్శతో
అడవి మృదుమధురపు
హృదయానందాన్ని స్పర్శించుతున్నాను.
చిరునవ్వుల సితారా సంగీతాలు
నీ నవ్వుల హరివిల్లులో గోచరిస్తున్నాయి.
నీ శరీరంలో ఏకమవ్వాలని పరితపించే
రేపటి అమరుడిని..
రాధా రేపటి అమరుడిని.
రాధా రాధా రాధా రాధా!

3)
కంటిపాపల చీకటిని
వెలిగించే సులోచనమూ,
గుప్పెడు మనసు పడే
భావాన్వేష ప్రేరణగా
కంటి పొరల చిహ్నాల సాక్షిగా,
నీ ముందు దహించిపోతున్నా.

స్వప్న విహారంలో మేలుకోల్పే వస్త్యమా,
పెదాలు పలికే మాటలకై అన్వేషించే దృశ్యమా,
మనసులోని మర్మాన్ని భావీకరించే అర్థమా
నీలో నన్ను మార్చుకునే ప్రయోగమా
మరువని అర్ధభాగస్వామ్యమా.... రాధా...!
రాధా అనుగ్రహించు,
కనికరించు, మైమరపించు
మోహింపచేయా...
నీ వయ్యారాల వలకబోతలో
రాగాల మాలనై పుష్పిస్తాను.
నీ కురుల చెంగుల్లు
నా మనసు పడే బాధలను
పెంచుతుంది.
రా నా పక్కకు రా
ప్రపంచం నీదీ, నాదీ..మనిద్దరిదీ.
నీ అజ్ఞాతం ఎంత భయంకరమైనది
ఓ రాధా!
ఇదిగో ఇప్పుడే, ఇక్కడే
స్వేచ్ఛను కోరుకుంటున్నాను.

4)

బృందావనంలో స్వేచ్ఛ స్త్రీ వంటిది
నిరీక్షణ నిర్మోహమాటంగా

నన్ను ఆవహించు వేళ
నిద్రా లేమి నుండి
ఇప్పుడే మేల్కొంటూ
వెచ్చని శేషపాన్పుపై
కునుకు తీస్తాను.
ప్రేమాస్పదమైన
ఆలింగనం నేడు కరువైనది.
ప్రపంచం నిష్కల్మషమైన
రతి క్రీడలో నిమగ్నమైతేనే జననం.
కారు మబ్బులలో
దాగియున్న సూర్యుడిని
తిలకించాలన్న ఆవేదన,
పరిపరివేదనలోని అమరజీవిని.
రాధా, నీ అమరజీవిని!
క్షణం తీరిక లేకుండా
సుఖం ధ్యాసే లేకుండా
నేను నేనుగా లేకుండా
భూమార్గం పట్టిన వేళ
ప్రపంచం పొత్తిళ్లలో
దాచిపెట్టుకున్న బిడ్డలా జీవించాను.
నీకై నిరీక్షణం
క్షణం యుగాలుగా గడుస్తున్నప్పుడు,
సుఖమే భాగ్యమవుతున్నప్పుడు

నేనూ నా వాళ్లూ ఏర్పడినప్పుడు
భూమిపై భారంగా ఉన్నప్పుడు
ప్రపంచం నుండి
మూలకు విసిరేసినట్లు
ద్వారక నుండి
దృశ్యాల వీక్షణం గావిస్తూ
ఒంటరినైనాను రాధా! ఒంటరినైనాను.
ఓ రాధా నా రాధా
నా ప్రియురాలా
ఓ ప్రియురాలా
నా పేరు నీ నోటినుండి
శబ్ద తరంగాలై
పలికించాలని రాస్తున్న లేఖ.
నీ యవ్వనం నాకర్పించాలని భక్తుడిగా
శాసిస్తూ రాస్తున్న లేఖ.
ఓ అమరత్వపు అప్సరసా..
నిన్ను బలాత్కరించే దశముఖుడను నేనేనని
గుర్తు చేస్తూ రాస్తున్న లేఖ.
నా రావణం వినిపించే ఈ లేఖ
వినిపించుకో ప్రియా!
వినిపించుకో ప్రియ రాధా!
సముద్రంలా ముంచెత్తు.
ప్రణయరాగంలో పడిలెగువు

సదా తనకై పరితపించు,
కాదనే కనికరమో... అవుననే అనురాగమో...
తెలియక తికమక మౌనంలో
నిరంతరం ప్రేమిస్తూ,
నా రాధా సహజయానమై
పరితపిస్తున్నాను రాధా!

5)

విషాదం వెన్నాడుతున్న వేళ
ప్రవేశించాను కురుక్షేత్రంలోకి
ధనస్సును నా భుజానికి
తగిలించుకుని
శత్రువుకై ఎదురు చూస్తూ
యుద్ధాన్ని
ఆహ్వానిస్తున్నా.. రాధా ఆహ్వానిస్తున్నా!
దారిద్ర్యమూ, అజ్ఞానమూ
అఘాయిత్యాలు నింపాదిగా
గర్భందాల్చి నూతన సమస్యలకు
పురుడు పోసిందీ కురుక్షేత్రం.
ఓ రాధా, ఓ రాధా!
ఇంకానా ఈ కన్నీళ్లూ?
ఇంకానా ఈ బాధలూ?
తల తెగిపడాల్సిన

శత్రువుపై కనికరమెందుకో?
మార్పును నీతోనే మొదలుపెట్టి
ఈ కురుక్షేత్రంలో
నూతన మానవునికి
జన్మనివ్వు.
రాధా, రాధా!
అజ్ఞాతం అలుపెరగనిదని
ఆయుధం అలసిపోనిదని
వాడికేమి తెలుసు.
నిశ్శబ్దం మోహమాటమెరుగనిదని
ఆవేశం అణుచుకోలేనిదని
వాడికేమి తెలుసూ..
కదిలే మనసూ,
కదిలించే సంఘటనలూ
కదలాడే సమాజ రూపాలే కదాని
వాడికేమి తెలుసూ!
సుదూర ప్రయాణానికి
అలవడ్డ మనం
అప్పుడే అలుపును
ప్రదర్శించడం ఏపాటి ఇంకితమో!
ఆత్మతృప్తిలో అహంభావం ప్రదర్శించడం
నాపై నమ్మకంలేక చూపే ధోరణే కదా!
రాధా!

మబ్బుల చాటున
దాగిపోతున్న సూర్యుడిని అందుకోవాలి.
లేదంటే, వెలుగును మరిచేకాలం
తప్పదు మనకు! తప్పదు మనకు!
రాధా ఇదే బృందావనతత్వం,
ఇదే బృందావన తత్వం!
ఈ బానిస సంకెళ్లు బద్దలయ్యే
రోజులు దగ్గరయ్యాయి.
శత్రువు గుండెల్లో వణుకుపుట్టే
కాలం ముందుంది,
నిటారు కొమ్మే వంగి దనస్సుగా మారి
మనల్ని బానములా వదులుతుంది,
శత్రువు మరో రుద్రుడును ఎదురుకుంటాడు,
శత్రువుగాడి తల చిప్ప ఆల్చిప్పలా మారి
రేపల్లె బాలుడి చేతిలో ఆటబొమ్మ అవుతుంది
కసిగా పీల్చే నా ఊపిరి
చింత నిప్పై తిరిగి వస్తుంది.
భగభగ మండే నా కనుగుడ్లు
వాడిరక్తపు మరకతో శాంతిస్తుంది.
ప్రియరాధా!
వాడు ఓడిపోయి
మనము గెలిచే రోజూ ముందుంది.
అది నీ అడుగుతో

ఒక అడుగు ముందుకు వేసినట్లే...
ఓ రాధా ఓ రాధా!
ప్రజల కష్టాలకి
ఈ కురుక్షేత్ర విజయం
శరణ్యమవ్వడానికి అడ్డంకేది?
అడవి నవ్వుల్లో విరబూసిన
ఎర్రని మందారానికి మరణమేది?
రేపల్లె గూడేల్లో
పల్లవైన వేణు గానానికి అంతమేది?
నాలో నిత్యమైన
రేపటి నూతన యుగపు
ఆశలకు అదుపేది?
అదుపేది రాధా!
నీ దర్శన భాగ్యమే
ఈ క్షణం కురుక్షేత్ర విజయం,
రాధా నన్ను గెలిచే నీ
గెలుపుకై అలసిపోయియున్నాను.
ఈ వియోగాన్ని నీకు
గీతోపదేశం చేస్తున్నాను.

6)
నా రజ స్థితి రాధా!
నా సత్వ స్థితి రాధా!

నా తమో స్థితి రాధా!
అర్ధాంగీ, అర్ధనారీ
మనోమయ -ప్రాణమయ
ఆనందమయ గోపికా!
నన్ను వలపించి
వల్లభత్వం ప్రసాదించవా
రాధా! రాధా!
అచింత్యుడనై
సచింత్యుడునై
నీకై పరితపింతుడునై
ఎదురు చూస్తున్నాను.
నా వికార, వికాస, విచార,
విమోచనా కోమలాంగీ!
లలిత-లావణ్య రసారవింద
రమ్య మనోహర రాధా!
నవనీత మధురాశ్రీ!
నన్ను ఆవహించ రావా రాధా!
నా మనోవైకల్య హృదయ వికార స్థితిని
పరిష్కరించ రావా !
నా గోపికా, ఈ కృష్ణుడి
నిర్లక్ష్యాన్ని, పాపాలను,
నీ వాత్సల్యంతో క్షమించవూ..
నీ ప్రేమరసత్వం

నీ కామప్రేరత్వం
నీ నిత్య యవ్వనత్వం
నా నిస్సహాయత్వాన్ని
పరిచయం చేస్తున్నాయి
ఈ నాట్య నాటకమయూరిని
సమ్మోహపర్చవా, సమ్మోహించవా....
నాపై ద్వేషమా? కోపమా? ఆక్రందనా?
అవును... నాయీ నిర్లక్ష్యానికి
నీ మరణవేదనా
రాగాల ఆక్రోశమూ న్యాయమే సుమా!
నన్ను క్షమించవూ..
నన్ను క్షమించవూ..
ఈ నిశిథిలో చంద్రుడవు
నీవై ప్రకాశిస్తూ
నా అంధకారాన్ని తొలగించవూ..
ఏమని చెప్పను?
మతి గతి తప్పడం అలవాటు పడితే
అదుపు చేసేది ఎవరూ?
నా మిత్రమా మనోవికారం
నుండి చాలా జాగ్రత్తగా
తప్పించుకున్నావోయీ!
నీ ఆనందానికి కుళ్లుతూ రాస్తున్నా ఈ కవిత!
సూర్యుడు ఉదయించే దిక్కుకి కళ్లుపోతుంటే

నా కుడివైపు వినపడే
తన గొంతు ధ్వనులు
వేడిగా వినబడుతున్నాయె...!
తాకిపోతున్నాయె!
అయ్యో,
ఈ భాగ్యంబు అభాగ్యంబుగా
నన్ను భాగాలుగా
అద్వైతం నుండి ద్వైతంగా
విశిష్టుడినై, శిష్టుడినై
శ్రేష్టుడినైనానో!
రాజీపడని నా అహం
అదుపు చేయని నా కామం మధ్య ఘర్షణ
తీవ్రతరం దాల్చడం
వేగవంతమయ్యే నోయీ!
అవసరం ఎంత పనిచేసిందీ
అవకాశం కోసం కాచుకుని పడగ విప్పాలని
బుసలు కక్కాలని, విషము చిమ్మాలని
దాని ఆవేదన.
అయ్యో,
ఆవశ్యకమై దానికి చిక్కి
మరణం సన్నిహితమై
బ్రతకడానికి ప్రయత్నిస్తున్న
ఆఖరి క్షణాన్ని నేను.

ఈ యథాజ్ఞానం అన్యథాజ్ఞానమై
సంపూర్ణత్వాన్ని అవగాహన కావిస్తూ,
ఆవాహన గావిస్తూ,
నా వేదనాభరిత వేదంబును
సామవేదంగా పాడుతున్నానోయీ!
ఈ ఋగ్వేదపు సత్యం
ఈ యజుర్వేదపు శుక్ల,కృష్ణత్వం
తెలుసుకోలేవా!
అగ్ని మిళే పురోహితమని జపించవోయీ..
యజ్ఞస్యమృత్విజమని సంకల్పించవోయీ..
భరతవంశపు బానిస బతుకులు
బద్దలకొట్టి మరో రామరాజ్యం
ఏర్పర్చాలోయీ!

7)

ఎంత దారుణతకు గురవుతున్నావో
పిచ్చి మనుషుల పిచ్చితత్వానికి
ఎంత దారుణతకు గురవుతున్నావో
నా రాధా!!
నీ మనసుపడ్డ భావ సంఘర్షణ
నాకెరుకనే
అది నాకర్థమైంది సుమా!
మనం కలిసియుండాలని

రేపటి జీవితపు వాస్తవికతను
ముందుగా ఊహించినాము
కానీ నీ భావాలకు విరుద్ధ
వాతావరణమేగా,
ఈ రోజుటి నిజాలు వాటిని
అబద్ధం చేశాయి నా నేస్తం,
నా ప్రియతమా!
ఎలా ఉన్నావు? ఉంటున్నావు?
నీలోని అణువణువూ నేనై ఉన్న రోజుల్లో...
అప్పటి మూర్ఖత్వపు తత్వమే
నీ వాడై పోకపోయాను.
నేను నీ చెంత చేరాలని కోరినా...
అప్పటికే ఇక వింతల
సమాజం నన్ను కాటేసింది.
ఇప్పటికీ కాటేస్తూనే ఉంది.
అవును ఒకప్పటి అవసరాన్ని
ఇప్పటి అనవసరాన్ని.
అవును ఇది ఎంత వాస్తవం.
నిజం ఇది నా కన్నీటి కళ్ల ఆవేదన
నా అవసరం వారి రేపటి ఆచరణ
నా అవసరం వారి రేపటి రక్షణ.
కానీ ఇప్పటి అనవసరాన్ని.
నా అణువూ అనవసరం,

నా తనువూ అనవసరం.
కానీ ఒకప్పటి అవసరాన్ని...
ఎంత విడ్డూరం.. ఇది విడ్డూరమే...
రేయీ పగలూ నా కోసరం
ఎదురు చూసినారు.
కానీ ఈ రేయిలో నన్ను వదిలేశారు.
పగలూ ఇక నా దేహానికి
స్పర్శ అవుతుందా?
రేయీ ఇక నా దేహానికి
స్పర్శ అవుతుందా?
నిజంగా నా దేహానికి స్పర్శ అయితే
మార్చగలదా! మార్చలేదా, మార్పురాదా?
లేదంటే ఈ కుళ్లిన వ్యవస్థ
మార్పు వరకూ
మారదా నా రాధా మారదా!
దీనికి అడ్డులేదు.
మహాసముద్రానికి అడ్డుంది.
కానీ దీనికి అడ్డేది?
దీని వ్యవహారం గూర్చి తేల్చలేము.
అసలు దీని వింతలూ మరవలేము.

8)

ఓ మనసా నీ వర్ణన ఎలా!

నీపై నేనే వర్ణన ఎంత ఆశ్చర్యం
ఏమి రాయను, ఏమి తెలుపను
నీవు వర్ణాతీతము కావు.
కానీ వర్ణనకు చిక్కవే.
ఓ వింతను జయించి
ప్రశ్నించి గెలిచావు
ఓ ఆశ్చర్యాన్ని కనుగొన్నావు
నీవే ఆశ్చర్యమనిపించావు
ఓ మనసా ఓ మనసా
నీవే అంతిమ విజయం.
వాస్తవం, తొలిచూపుల పలకరింపులు
అవి అబద్ధమా? నిజమా?
అని కలలు కంటున్న వేళ
తొలి చూపును
మలిచూపులుగా మార్చావు
అప్పుడే నా గాయపడ్డ హృదయానికి
నూతన మైకముగా
నీ చూపులు తగిలాయి
నా గాయాలు మానాయి
అప్పుడే నా హృదయ అలజడి
కళ్లకి చేరి నీ నీడ కోసం అన్వేషిస్తున్నాయి
నీ మాటల తరంగాలు విని
నా గుండె బరువెక్కినది

నీ కంటి కాటుకను
చేరదీయాలని కోరికే
కౌగలించాలనీ
ఆప్యాయంగా లాలించాలనీ నా తపన
నీలో నన్ను చూసుకోవడం లేదు
నిన్ను నిన్నుగా చూస్తున్నాను
అందుకే మళ్లీ ప్రేమించాను
ఇక భౌతిక పరిచయాలైనాయి
భావ పరిచయాలకు వేచిచూస్తూ....
నీ దూరం నా నిర్లక్ష్యం
నీ దు:ఖం నా మూర్ఖత్వం
నీ బాధ నా ద్వేషం రాధా
క్షమించవూ...
ఈ కృష్ణున్ని శిక్షించవూ...
ఈ మాయాకారునికి మాయత్వం
బోధపడినది రాధా...రాధా రాధా!
నీ తలంపు ద్వారాలు తెరుచుకోవా...
నన్ను ఆహ్వానించవా!
ఈ రాముడి వియోగమూ,
సుగ్రీవుని బాధా తెలుస్తున్న వేళ
నన్ను కోల్పోతున్నా రాధా!
నన్ను ప్రేమించు రాధా.....
రాధా ప్రేమించవూ

ప్రేమించు రాధా...
నీ కన్నీటి అర్థాన్ని
అవగాహన చేసుకుంటున్నా ప్రియా,
దయ ఉంచవా, కనికరించవా
ఈ శృంగార శృంగభంగకారుడిని
శిక్షించి, క్షమించవూ...
నేనొక స్వార్థపరుడ్ని
నా ప్రేమ స్వార్థం,
నా ప్రేమ నాదై యుండాలి...
నా ప్రేమను దూరం పెట్టే ప్రేమను
భరించలేను రాధా...
ప్రేమ పిచ్చితనం అవ్వచ్చు
కానీ తాత్వికులన్నట్లు
పిచ్చితనం కూడా హేతుబద్ధమైనదే
నన్ను ఎందుకు దూరం చేస్తున్నావు?
నన్ను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావు?
నా స్వార్థపు ప్రేమ
స్వార్థరహితంగా ప్రేమించడం లేదా నా రాధా!
నా ప్రేమా ద్వేషించకు,
దూరం కావడం కన్నా నన్ను వీక్షించకు,
నన్ను కవ్వించకు, నన్ను నిందించకు,
నాకై కన్నీరు కార్చకు,
నీ గొంతు ధ్వనుల తరంగాలను

నా హృదయం వింటుందోయీ..
కానీ నీవు నా హృదయాన్ని వినడం లేదుగా...
ఎందుకు రాధా, ఎందుకు?
నీవు నా ప్రేమవు
నా స్వార్థం నీవు
నా నిస్వార్థమూ నీవే
నా ప్రేమ, నా ప్రేమా
నా ప్రేమను ప్రేమించవూ
నా ప్రేమను స్వార్థంగా
నా ప్రేమను నిస్వార్థంగా ప్రేమించవూ
ప్రేమించడం తప్పు కాదు
ప్రేమించబడటం తప్పుకాదు
ప్రేమలో ద్వేషించబడటం కూడా తప్పు కాదు...
కానీ మోసం చేయడం,
మోసం చేయబడటం మాత్రం
దాని ప్రత్యేకతే కదా రాధా....
రాధా నా ప్రేమ
నీకై నా ప్రేమ
పిచ్చితనంగా
వెర్రితనంగా
మతి భ్రమణంగా
తోస్తూ ఉందా....
నీపై ప్రేమను

పిచ్చిగా, వెర్రితనంగా
మతిభ్రమణంగా
పిలిచినా, నామకరణం చేసినా
సంతోషించకుండా ఉంటానా?
మతిస్థిమితం లేని ఈ సఖుడిపై
కనికరమూ, ప్రేమత్వమూ చూపవా!
నీ తలంపులతో
నరకపు అంచులలో
నిలుచొని అనుభవిస్తున్న
తీవ్ర వేదనను వివరించలేక
సతమవుతూ మరణించదల్చాను
ప్రియ రాధా!
నీ కృష్ణుని ప్రేమను
పిచ్చి ప్రేమ అని తిట్టు
లేదా గుడ్డి ప్రేమ అని అంటావా?
లేదా రతిక్రీడల రాసలీలలని పిలుస్తావా?
ఏమని పిలుస్తావూ ప్రియ రాధా!
ఏమని పిలుస్తావూ?
నేనొక ప్రేమ నియంతను,
ప్రేమ నియంతృత్వం
అన్ని వైపులా కాలంలోనూ సాధించాలని
సాధింపచేయాలని, నియంత్రించాలని
అణచివేస్తున్నాను,

యుద్ధం చేస్తున్నాను, శిక్షిస్తున్నాను,
ప్రియ రాధా! ప్రియ రాధా!!
ఈ నియంతృత్వంలో భాగమవ్వవా?
నాలో ప్రేమ నియంతకు
రూపం కావా?
రేపల్లె అందాలను అడగవా,
గోవులను, గొర్రెల మందలను అడగవా....
నా ప్రేమ నియంతృత్వం ఘోషిస్తాయి
నేను కంసుడిని కాను రాధా!
కంసుని సంహారకుడిని రాధా!
చెడును అంతమొందించిన నీ సఖుడిని,
నీ దాసుడిని, నీ వాత్సల్యాన్ని
నిరంతరం స్మరిస్తూ
నీ ఒడిలో తలవాల్చుకోవాలనే కృష్ణుడ్ని రాధా!
రాధా నీ కృష్ణుడ్ని...ప్రియ రాధా!
నన్ను మించిన మంచిని చూపు ప్రియ రాధా!
నన్ను మించిన సత్యాన్ని చూపు ప్రియ రాధా!
నన్ను మించిన ప్రియుడ్ని చూపు
నా సంగీతపు రాగాల వినికిడికి
మన గత కాలపు ప్రేమలు జ్ఞాపకం రాలేదా?
నా పాదాల చప్పుడులకు
మేలుకునే నీ తురీయావస్థను ప్రశ్నించుకోవా?
నేను నీ దైవాన్ని

శ్రీ కృష్ణుడిని రాధా!
నీ కృష్ణుడ్ని, నీ సఖుడిని
నీకై తపిస్తున్న ప్రేమ సన్యాసిని
నీ ప్రేమ ఋషిని, నీ ప్రేమ భోక్తుడికి
భోగ్యానివి నీవే రాధా!
నీ వ్యతిరేకతలో, నీ కోపాగ్నిలో
దహించుకుపోతున్న దాస్యుడిని
ప్రియ రాధా!
రాధా నా ప్రియ రాధా!
నీ దాస్యుడి మొర వినవూ....
రాధా నా రాధా!
దయ వుంచవూ రాధా!
నా ప్రియ రాధా!
నేను మోసగాడిని కాను
సత్యం కోసం మోసాన్ని మోసగిస్తున్నాను,
ప్రేమకు భాష ఎక్కడిది?
ప్రేమే భాష కాదా?
నీకు ప్రేమ భాష తెలియదా?
ఐతే నీవు ప్రేమలో లేవనే కదా?
ముఖ్యంగా నా ప్రేమలో లేనట్లే కదా?
నేను ప్రమాణం చేస్తున్నాను.
నీకు మోక్షం లభిస్తుంది.
మోక్షం అన్ని అడ్డంకుల నుండి లభిస్తుంది.

నేను మోక్షానికి అత్యంత దగ్గరగా
నీ ప్రేమతో చేరువయ్యాను.
నా ప్రేమను ఎగతాళి చేయకు,
ఎగతాళి చేయకు,
నీకు కనబడటం లేదూ..
నీకు వినపడటం లేదూ..
నీకు స్పర్శించడం లేదూ..
నీకు రుచి అవ్వడం లేదూ..
నా ప్రేమ....
నన్ను ప్రేమించక పోయినా పర్వాలేదు
కానీ ద్వేషించకు
ద్వేషించకు రాధా....
నా ప్రేమను తెలుసుకోవా
నా హృదయ చప్పుడులను విని,
నా హృదయ గొంతుకను విని తెలుసుకోలేవా?
నీ భావాలకు నా హృదయం వ్యసనమైనది...
నీ భావాలు అమరులు, నేను మరుడిని,
నీవు నన్ను మరచి పోవచ్చు
నేను కనబడకపోవచ్చు
కానీ నీలో జన్మింపచేస్తున్న భావాలూ
నాలో నీవు ప్రతిఫలిస్తున్న భావాలూ అమరులు
నన్ను నమ్ము
నేను నీకై మరణిస్తానని

మాటిస్తున్నాను...
నీవు ఆనందంగా
ఉండాలని కాంక్షిస్తున్నాను...
అప్పుడే నా ఆత్మ శాంతిస్తుంది...
నా కోపమూ ప్రేమే
నా కుళ్లూ ప్రేమే
నా దు:ఖం కూడా ప్రేమే సుమా...
నేను నిన్ను ప్రేమిస్తున్నాను
నీ ప్రతి జవాబుకై
ఎదురు చూస్తున్నాను...
నీ ద్వేషం నుండి తప్పించుకునేదే
నీ ప్రేమను పొందటంకై,
ప్రేమను పొందటంకై,
ప్రేమను సంపాదించడంకై... రాధా!
నేను నీ ప్రేమ నుండి
పారిపోవడం లేదు
సమయం అత్యంత
తక్కువుంది రాధా!
ఎందుకంటే అది
అత్యంత వేగవంతమైనది
వేగవంతమైనది... రాధా!
కానీ స్థలం అప్పటికే
నీతో నిండుకుంది

ప్రియ రాధా!
కాలాన్ని మన ప్రేమకు
వెంటరావాలని బలవంత పెడుతున్నాను.
దైవం కన్నా ఇష్టపడుతున్నాను.
నీవు నా ప్రేమ
దేవతవోయీ...
నా రాణీ నా ప్రేమను
తెలుసుకోవా....
నా తపనను
తెలుసుకోవా...
నా తపన
నిన్ను నా ప్రేమికురాలను చేయాలనే
నీ ప్రేమికుడిని కావాలనే
ప్రియ రాధా...
ప్రియ రాధా...
నన్ను నేను పరీక్షించుకుంటున్నాను.
నా ప్రేమను నేను
పరీక్షించుకుంటున్నాను.
అది నా సమస్య
నేను నీ ప్రేమ భావాలను నమ్ముతున్నాను.
నన్ను ప్రేమించడానికి సంకోచించకు.
నా స్వార్థాన్ని స్వార్థ రాహిత్యంతో
బాగు చెయ్యవా?

నన్ను ప్రేమించడానికి
సంకోచించకూ...
నా స్వార్థ ప్రేమ స్వార్థ రాహిత్యానికే
నేను నిన్ను వీడుతున్నాను
ఒక్కసారి వచ్చి కలసిపోవా
ఒక్కసారి వచ్చి కలసిపోవా
ఒకే ఒక్కసారి వచ్చి పోవా...
నేను వెళ్లి పోతున్నాను
నేను వెళ్లి పోతున్నాను...
నీ ప్రేమ భావాలనుండి
మాత్రం కాదు....!
నేను నీ కోసం మరణిస్తున్నాను
నేను నీ ప్రేమ కోసం మరణిస్తున్నాను
నేను మరణించాను, నేను మరణించాను,
నిన్న నీ ప్రేమకోసం మరణించాను
నిన్న నీకు నిన్ననే రాధా!
కానీ నాకు నిన్న కల్పాలు రాధా!
నాకు కల్పాలు...
నేను నిన్ను ప్రేమిస్తుంటే
నీ విరహంతో మరణించేట్లు చేస్తున్నావు..
నా ప్రేమను ఎందుకు మరణింపచేస్తున్నావు
ఎందుకు మరణింపచేస్తున్నావు?
కావాలంటే నన్ను చంపేయీ... రాధా!

నా ప్రేమను బ్రతికించు
బ్రతికించు...
నా ప్రేమను బ్రతికించు
నిన్ను ప్రేమించడానికి
నా ప్రేమను బ్రతికించు
ప్రియ రాధా...
నా ప్రేమను బ్రతికించు...
ఉదయిస్తున్న సూర్యుని
కాంతి కిరణాలతో
విరజిమ్మిన మల్లెపూల
సుగంధ సువాసనలు
నా ఎదను తట్టింది
ఈ వేల పచ్చని పైరులో
వీస్తున్న నా ఎదను
ప్రకాశింపచేసిన ఓ నా
మల్లెపూవ నీకివే
నా ప్రణామములు
ప్రణామములు రాధా...



- అవిచ్ఛిన్నం